ధర్నా చేస్తున్న నాయకులు

భారాల నియంత్రణపై దృష్టి పెట్టాలి

- విస్తృత ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి - విద్యుత్ నియంత్రణ మండలి ముందు సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ నియంత్రణ మండలి ఆన్లైన్ అభిప్రాయ సేకరణకు మాత్రమే పరిమితం కాకుండా, పారదర్శకతతో విస్తత ప్రజాభిప్రాయాన్ని సేకరించి, భారాల నియంత్రణపై దృష్టి పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు, దిన్నదేవరపాడు గ్రామం వద్ద గల విద్యుత్ నియంత్రణ భవనంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్న సందర్భంగా కార్యాలయం ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్ల కార్డులు చేత పట్టుకుని ధర్నా నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయి బాబా అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఎండి ఆనంద్ బాబు, ఎండి అంజిబాబు, జిల్లా కమిటీ సభ్యులు నగర కార్యదర్శి ఎం రాజశేఖర్, జిల్లా కమిటి సభ్యులు గురుశేఖర్ మాట్లాడారు. ప్రస్తుతం వస్తున్న ట్రూప్ చార్జీల కారణంగా ఉచిత విద్యుత్తు వస్తున్న వాళ్లకు సైతం అధిక మొత్తంలో బిల్లులు వస్తున్నాయన్నారు. సెకి ఒప్పందం ద్వారా అదానీతో 25 సంవత్సరాల పాటు కొనసాగునున్న సోలార్ విద్యుత్ ఒప్పందం కారణంగా సంవత్సరానికి రూ.4350 కోట్లు ప్రజలపై అదనపు భారం వేస్తున్నారన్నారు. వ్యవసాయ మోటార్లకు, నివాస గహాలకు, చిన్నా మధ్యతరగతి వ్యాపార సంస్థలకు మీటర్లను బిగించడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్తు నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ బృందం ఎదుట సిపిఎం అభిప్రాయాన్ని తెలియజేసి, వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నా కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఉసేనయ్య, జిల్లా నాయకులు రాఘవేంద్ర, రంగప్ప, ఎన్ జి కష్ణ, మహమ్మద్ రఫీ, నరసింహ, బిసన్న, మస్తాన్, మధు, నంద్యాల జిల్లా నాయకులు లక్ష్మణ్, బాల వెంకట్, పుల్లా నరసింహ, వెంకట లింగం, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు విద్యుత్ సౌధ ముందు..

కర్నూలు విద్యుత్ సౌధ ముందు శుక్రవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వై.నగేష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. డిఇకి వినతి పత్రం అందించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రాముడు, నంద్యాల జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, వి.యేసురత్నం, ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.విజయ్‌రామాంజనేయులు మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంలోని పెద్దలు మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని, ట్రూ ఆఫ్ చార్జీలను, సర్ చార్జీలను రద్దు చేస్తామని ప్రగల్బాలు పలికి నేడు అధికారంలోకి వచ్చాక ఆరు నెలల కాలంలోనే దాదాపు రూ.18 వేల కోట్ల ట్రూ అప్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడానికి సిద్ధపడ్డారన్నారు. ప్రజలపై బారాలేస్తే సిపిఎం చూస్తూ ఊరుకోదని 2001లాంటి విద్యుత్ పోరాటాన్ని చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప, ఓల్డ్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్, అబ్దుల్ దేశాయ్, రామకృష్ణ, యేసు, ఉశేన్‌బాష, శేషాద్రి, శ్రీను, సత్యం, సాయి, మురళి, మహిళా నేతలు పిఎస్ సుజాత, కెఎస్ పద్మ, జయమ్మ, సావిత్రి, నంద్యాల జిల్లా నాయకులు, కార్యకర్తలు లక్మిదేవి, రెండు నగర కమిటీల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం, పిపిఎస్ఎస్ నాయకులు,

విద్యుత్ ఒప్పందాలను, భారాలు రద్దు చేయాలి

- వ్యాపార, వాణిజ్య, పట్టణ పౌర సంక్షేమ సంఘాలు

విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాటపై నిలవాలని. గత ప్రభుత్వం చేసుకున్న అవినీతి విద్యుత్ ఒప్పందాలను, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఎపిఇఆర్‌సి భవన్ ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో వ్యాపార, వాణిజ్య యజమానుల సంఘాలు తోపాటు పలు కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ధర్నాకు ఎం నాగరాజు అధ్యక్షత వహించారు. అనంతరం బహిరంగ విచారణ సందర్భంగా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు కె రామచంద్రారెడ్డి, కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు న్యాయవాది ఆర్ చంద్రశేఖర్, ఎస్ మాణిక్య రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కరెంటు బిల్లులనే చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు పెట్టడం ఉపసంహరించుకోవాలన్నారు. ఎపిఇఆర్‌సిని కర్నూలులోనే కొనసాగించాలన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ అతివృష్టి, అనావష్టి తోపాటు పారిశ్రామిక అభివద్ధి జరగకపోవడం వల్ల రాయలసీమ జిల్లాలు వెనుకబడ్డాయని, అభివృద్ధి అయిన ప్రాంతానికి, వెనక వెనకబడ్డ ప్రాంతానికి ఒకే రకమైన కరెంటు చార్జీలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ట్రూ ఆప్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీల అసోసియేషన్ల, రైస్ మిల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డి శ్రీనివాసరెడ్డి, బి నాగేంద్ర, ఎండి యూనుస్, సివి వర్మ, కే నాగరాజారావు, ఎస్ ఆర్ గౌడు, న్యాయవాది టి సురేష్ మహారాజు, ఎం సురేష్ రెడ్డి, బి నాగేంద్ర, పీ రుస్తుం వలి, ఎన్ మద్దిలేటి, బి వన్నూరు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్: సిపిఐ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రెగ్యులేటరీ విద్యుత్ కమిషన్ బహిరంగ విచారణ కమిటీ ఆఫీస్ ముందు ధర్నా చేశారు. ఈ ధర్నా కు సిపిఐ నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షత వహించారు. ధర్నాను ఉద్దేశించి సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడు నెలల కాలంలో ఈ రాష్ట్రంలోని పేద మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ ఛార్జీల రూ.15,432 వేల కోట్ల బారాలు మోపడం చాలా దుర్మార్గమని అన్నారు. ఎపిఇఆర్‌సి చైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్, విద్యుత్ రెగ్యులేటర్ కమిషన్ నెంబర్ పివిఆర్ రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు.

కర్నూలు విద్యుత్ సౌధ ముందు ధర్నా చేపడుతున్న నాయకులు

స్వచ్ఛ ఆంధ్ర క్లాప్ ఆటోలను కొనసాగించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్వచ్ఛ ఆంధ్ర క్లాప్ ఆటోలను కొనసాగించాలని, డ్రైవర్లకు పని భద్రత కల్పించాలని, మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందం అమలు చెయ్యాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ వర్కర్స్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమ్మె కాలపు ఒప్పంద జిఒలను అమలు చేయాలని, క్లాప్ ఆటోలను కొనసాగించి క్యాబ్ డ్రైవర్లకు పని భద్రత కల్పించాలని, ఆంధ్ర క్లాప్ డ్రైవర్ల ఏడు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు సిఐటియు నగర క్లాప్ డ్రైవర్ల కార్యదర్శి రఘుశేఖర్ అధ్యక్షతన ధర్నా చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సిఐటియు ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి మారెళ్ళ విజయ రామాంజనేయులు, నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, ఉపాధ్యక్షులు మహిమూద్, ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు కుమార్ మాట్లాడారు. కర్నూలు నగర పరిధిలో పనిచేసే క్లాప్ డ్రైవర్లకు 7 నెలలుగా పెండింగులో జీతాలు ఉండటం వలన కార్మికుల కుటుంబాల గడవక చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కర్నూలు నగరంలో ఉండే 52 వార్డులు చెత్త లేని నగరంగా పరిశుభ్రంగా ఉన్నాయంటే క్లాప్ డ్రైవర్ల కష్ట ఫలితమేనని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ పేరుతో ఆటోలకు డ్రైవర్లను రిక్రూట్‌మెంట్ చేసుకుని అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 జీతం ఇఎస్ఐ, పిఎఫ్, కార్మిక చట్టాల అమలు చేస్తామని చెప్పి బినామీ ఏజెన్సీలతో కార్మికుల కడుపు కొట్టారని విమర్శించారు. గతంలో కార్మికుల పోరాటం వలన కమిషనర్ జోక్యం చేసుకొని కొంత పెండింగ్ జీతాలు ఇచ్చి ఇప్పటినుండి జీతాల బాధ్యత నాదేనని ఒప్పుకుని పని చేయించుకుని కార్మికులను మోసం చేశారని తెలిపారు. సమ్మె కాలంలో కార్మికుల పోరాటాలకు మద్దతుగా నిలబడిన టిడిపి నాయకులు అధికారంలోకి 8నెలలయినా కార్మికుల సమస్యల పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల పైన భారాలు వేయకుండా చెత్త పనులను రద్దు చేయడం మంచి పరిణామమైనా, క్లాప్ ఆటోలకు విధి విధానాల అమలు చేయకపోవడం, కొంతమంది టిడిపి నాయకులు క్లాప్ ఆటోలను తీసేసి కాంట్రాక్టు పద్ధతిలో మా ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుంటామని బహిరంగ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. క్లాప్ ఆటోలను తొలగిస్తామంటే ఓట్లు వేసిన కార్మిక కుటుంబాలకు పోషణ ఎలా జరుగుతుందని మాత్రం ఆలోచన చేయడం లేదని బాధ వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కార్మికులను మోసం చేసినందుకే ఇంటికి పంపించారని, ఈ ప్రభుత్వమైనా చొరవ తీసుకొని కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేసి పెండింగ్ జీతాలు ఇప్పించి, అగ్రిమెంట్ ప్రకారం నెలకు రూ.24 వేల జీతాన్ని ఇప్పించి, ఇఎస్ఐ,పిఎఫ్, వీక్లీ ఆఫ్ లు అమలు చేసి పని భద్రత కల్పించి కార్మికుల పక్షాన నిలవాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షాన కార్మికులకు న్యాయం జరిగేంత వరకు సిఐటియు పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ధర్నా కార్యక్రమం ముగిసిన తరువాత కార్మిక శాఖ అధికారిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్లందరూ పాల్గొన్నారు.

పకడ్బందీగా పారిశుధ్య పనులు

- నగరపాలక కమిషనర్ రవీంద్ర బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో ప్రతి వీధిన పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం తెల్లవారుజామున బళ్ళారి చౌరస్తా, నరసింహా రెడ్డి నగర్, రోజ స్ట్రీట్, పాత ఈద్గా, సంపత్ నగర్, గాంధీ నగర్, పాత కంట్రోల్ రూం, తదితర ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. నగరంలో ప్రతి వీధిన చివరి వరకు పారిశుధ్య పనులను చేపట్టాలని, ప్రతి రెండు వారాలకు ఒకసారి తప్పనిసరిగా పూడికతీత పనులు చేపట్టాలని కమిషనర్ పారిశుధ్య తనిఖీదారులకు సూచించారు. పూడికతీత పనుల అనంతరం వాటి వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంప్ యార్డుకు తరలించాలని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. పారిశుధ్య పనులు నిర్వహించే క్రమంలో ఏవైనా సమస్యలు ఉంటే ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని, పారిశుధ్యంలోపిస్తే సంబంధిత తనిఖీదారుడిదే బాధ్యతన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుధ్య తనిఖీదారులు ముంతాజ్ వలి, మునిస్వామి, అనిల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

రిసెప్షన్‌కు హాజరైన బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపి బస్తిపాటి నాగరాజు

మంత్రి భరత్ కుమార్తె వివాహ విందుకు ప్రముఖుల హాజరు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ కుమార్తె ఆర్యపాణ్య, నళిన్ వివాహ విందు కార్యక్రమం శుక్రవారం కర్నూలు ఎస్‌పి క్యాంపులోని రెండవ బెటాలియన్ మైదానంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈనెల 4న తెలంగాణ రాష్ట్రం, శంషాబాద్ జిఎంఆర్ ఫంక్షన్‌హాలులో టిజి ఆర్య పాణ్య, బొమ్మిడాల వెంకట శ్రీనళిన్ తో జరిగిన వివాహమైంది. ఈ వివాహానికి ప్రత్యేక పరిస్థితుల్లో కొంతమంది ప్రముఖులను మాత్రమే ఆహ్వానించారు. మంత్రి టిజి.భరత్ కుటుంబం స్థానికంగా జిల్లాతో పెద్ద ఎత్తున అనుబంధం ముడిపడి ఉండడంతో స్థానిక నాయకులను పార్టీ కార్యకర్తలను, శ్రేయోభిలాషులను, ప్రజలకు ఆతిథ్యమిస్తూ భారీ ఎత్తున వివాహ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వివాహ వేడుకలో భాగంగా భారీ ఎత్తున అతిథులకు ఏర్పాట్లను చేపట్టారు. ఇందులో ఏర్పాటుచేసిన ఆర్కెస్ట్రా, భోజన సదుపాయాలు, ఇతర ఈవెంట్స్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, పలువురు ఎమ్మెల్యేలు, రాష్ట్ర స్థాయి అధికారులు, ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు టిడిపి నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ సిఐటియు అనుబంధం నూతన క్యాలెండర్, డైరీనీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ శుక్రవారం ఆమె చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.సంధ్యారాణి, జిల్లా అధ్యక్షురాలు ఎం.మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఎపి ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఎపి ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఐఎన్‌టియుసి అనుబంధం 3194 కర్నూలు జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ యూనియన్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు ఎంసి నరసింహులు, జిల్లా కార్యదర్శి ఎన్‌డి. సంపత్ కుమార్, కోశాధికారి ఎస్.సాయిరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇ బాలకృష్ణయ్య , కె.సురేష్ బాబు జిల్లా కార్యవర్గం, తాలుకాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

20న మద్దికేర మండలపరిషత్ సమావేశం

ప్రజాశక్తి-మద్దికేర

ఈనెల 20న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఎంపిడిఒ కొండయ్య తెలిపారు. ఎంపిపి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖలకు సంబంధించిన సమస్యలపై అజెండాలు ఉంటాయన్నారు. ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రభుత్వ అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.



ఎర్రమట్టి బిల్లులో అక్రమాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ మండలం గొల్లలదొడ్డిలో ఆయా వీధులకు అవసరమైన ఎర్రమట్టి తరలింపు బిల్లులలో అక్రమాలు జరిగాయని గ్రామ పెద్దలు శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఎర్రమట్టి పరుపు కోసం గతేడాది సర్పంచి కొడుకు లోకేశ్వర్ సుమారు రూ.4 లక్షల వరకు పంచాయతీ బిల్లు అందుకున్నారని వారన్నారు. వాస్తవానికి గుంతల పూడికకు రూ.లక్షలోపు కూడా బిల్లు కాదని పలుకుబడితో పంచాయతీ బిల్లు అధికంగా చేసుకొని ప్రజాధనం ఆక్రమించుకోవడమేనని విచారణ చేసి చర్యలు చేపట్టాలన్నారు.

జగన్ శవరాజకీయాలు మానుకోవాలి

బిసి హాస్టళ్ల మరమ్మతులకు రూ 4 కోట్లు-బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తిరుమల వెంకన్న వైకుంఠ ద్వార దర్శన టికెట్ల కోసం వెళ్లి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జగన్మోహన్ రెడ్డి శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని ఆమె హితవు పలికారు. బిసి సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతులకు రూ. నాలుగు కోట్ల నిధులను విడుదల చేసినట్లు వెల్లడించారు. శనివారం కర్నూలు ప్రభుత్వ అతిథి గృహంలో ఎంపీ బస్తీ పాటి నాగరాజు కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్పతో కలిసి మంత్రి సవిత విలేకరులతో మాట్లాడారు. తిరుమలలో జరిగిన ఘటన భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూస్తున్నామన్నారు. తిరుపతికి వచ్చిన జగన్ తొక్కిసలాట బాధితులను పరామర్శించిన అనంతరం శవరాజకీయాలకు తెరతీశారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో గెలిచేందుకు కోడి కత్తి డ్రామాను జగన్ ఎంత ఆసక్తికరంగా రక్తికట్టించారనే విషయం సైతం ప్రజలందరికీ తెలుసని మండిపడ్డారు. అధికారం ఉన్నా, లేకున్నా రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసమే సీఎం చంద్రబాబు అహర్నిశలు పాటుపడుతారని చెప్పారు. బిసి అభివృద్ధికి రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేయనున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన బిసి భవన్ ల నిర్మాణాలు కూడా త్వరగా పూర్తి చేస్తామన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

జాతీయ స్థాయి నృత్యపోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కల్చర్

నటరాజనృత్య కళామందిర్, టిజివి కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో మూడు రోజుల పాటు నిర్వహించే శాస్త్రీయ జానపద నృత్య పోటీలను పారిశ్రామికవేత్త సినీ నటులు బివి రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య ప్రారంభించారు. శుక్రవారం రాత్రి టి జీవి కళాక్షేత్రంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాలకు నిర్వాహకులు కరీముల్లా స్వాగతం పలుకుతూ వరుసగా పదవ సంవత్సరం కళా సౌరభ అవార్డుల నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సప్తగిరుల వైభవం నృత్య రూపక పోస్టర్‌ను బివి రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జానపద శాస్త్రీయనృత్య ప్రదర్శనలు చూడటానికి తల్లిదండ్రులతో పాటు ప్రేక్షకులకు ఆసక్తి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు స్వరూపసింహ, ఉపాధ్యాయులు క్రిష్టిపాటి రామశర్మ, వ్యాఖ్యాత సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు రోజుల నిర్వహణలో కొంత ఖర్చు కోసం బివి రెడ్డి రూ.10 వేల నగదును ప్రకటించారు.

నృత్య కళాకారులతో అతిథులు జి.పుల్లయ్య పత్తిఓబులయ్య, బివిరెడ్డి, తదితరులు

పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి-పత్తికొండ

కూటమి ప్రభుత్వం ప్రజలపై పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండలో సిఐటియు మండల కార్యదర్శి గోపాల్ అధ్యక్షతన ఈశ్వర్ రెడ్డి భవనం నుండి సిపిఎం నాయకులు కార్యకర్తలతో కలిసి కరెంటు ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల గడవక ముందే కరెంటు చార్జీలను పెంచి ప్రజలపై భారాలను మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు.సెకీతో ఒప్పందాలు రద్దు చేయాలని, వ్యవసాయ బోర్లకు మీటర్ల బిగించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సిపిఎం నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పత్తికొండ ఎఇ నారాయణస్వామి నాయక్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు రంగారెడ్డి, దస్తగిరి, రామాంజనేయులు, గంగన్న, తుగ్గలి మండల కార్యదర్శి శ్రీరాములు, హమాలీ నాయకులు ఉరుకుంద ,ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు రంజిత్, వివేక్, మాజీ నాయకులు మధు వినోద్ పిఎన్ఎం నాయకులు రమేష్, రైతు సంఘం నాయకుడు రాముడు పాల్గొన్నారు.

ఎఇ నారాయణ స్వామికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న ఎంపి బస్తిపాటి నాగరాజు

కళాశాల అభివృద్ధికి రూ 10 లక్షలు

కర్నూలు ఎంపి బస్తి పాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కళాశాల అభివృద్ధికి ఎంపీ నిధులనుండి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు కర్నూలు ఎంపి బస్తీ పాటి నాగరాజు ప్రకటించారు. శనివారం కర్నూలు కెవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ జి.లాలప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపి బస్తిపాటి నాగరాజు, జిల్లావృత్తి విద్యాధికారి పరమేశ్వర్ రెడ్డి, ఆర్ఐఒ గురువయ్యశెట్టి పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి కళాశాలకు పేరు తీసుకురావాలని కోరారు. ఎంపి నిధుల ద్వారా కేటాయించిన నిధులను అదనపు తరగతి గదులు నిర్మాణానికి ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం కళాశాల విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను కట్టి పడేసాయి. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ చైర్మన్ మాధవ నాయుడు, విశ్రాంత ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, చెన్నయ్య, సుంకన్న, సరళ దేవి, కరుణాకర్ ,ప్రభు చరణ్‌లు పాల్గొన్నారు. అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిణులు పాల్గొన్నారు.



మందుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

అధిక ధరకు మందులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు మండలంలోని మండల కేంద్రంలో రసాయన ఎరువుల దుకాణాలను , ఇంటర్నల్ స్క్వాడ్‌లో భాగంగా డిఆర్‌సి, ఎడిఎ వెంకటేశ్వర్లు, కర్నూల్ డివిజన్ ఎడిఎ ఎన్.సాలు రెడ్డి , మండల వ్యవస్థాయ అధికారి రవి ప్రకాష్ శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, శ్రీ లక్ష్మీ ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. కచ్చితంగా స్టాక్ బుక్కులు అప్డేట్ గా ఉండాలని, ప్రతిరోజు స్టాక్‌ను అప్‌డేట్ చేయాలని, ఈపాస్ మిషన్లో ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మ రాదన్నారు. షాపులో ప్రతిరోజు స్టాక్ బోర్డు , ఎంఆర్‌సి రాసి ఉంచాలన్నారు. రసానిక ఎరువులతో పాటు రైతుకు దానితోపాటు ఇతర మందులు ఇవ్వకూడదన్నారు. ఆర్గానిక్ ఫర్టిలైజర్స్ అని రకరకాల మందులను రైతులకు ఇవ్వకూడదన్నారు. రైతులకు మండలంలోని డీలర్లు ఎవరైనా కూడా ఇబ్బంది కలిగించిన యెడల మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయ వచ్చున్నారు.

విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై భారాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నారాయణ, వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని

వినతి పత్రం ఇస్తున్న నాయకులు

విద్యుత్ చార్జీల పెంపుదల లేదంటూనే ప్రజలపై ప్రభుత్వం భారాలు మోపుతూనే ఉందని, విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.నారాయణ, కె.వెంకటేశులు, సీనియర్ నాయకులు ఈరన్న పేర్కొన్నారు. శుక్రవారం విద్యుత్ భవన్‌లో డిఇ హారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2025-26 సంవత్సరంలో విద్యుత్ చార్జీల పెంపుదల లేదంటూనే సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.కోట్ల భారం మూడుసార్లు మోపిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింతగా భారాలు మోపేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతోందని చెప్పారు. పంపిణీ సంస్థలు విద్యుత్ మిగులు భవిష్యత్ అవసరాలపై తప్పుడు లెక్కలతో అంచనాలు రూపొందిస్తున్నారని తెలిపారు. అదానీ కంపెనీలకు మేలు చేసే విధంగా ప్రైవేట్ సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలు చేసేందుకు తప్పుడు అంచనాలను రూపొందిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు కార్పొరేట్లకు మేలు చేసే విధంగా, ప్రజలపై విద్యుత్ భారాలు వేసే విధంగా ఉన్నాయని తెలిపారు. మహానంద రెడ్డి, సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, నాయకులు గోపాల్, తిప్పన్న, రామాంజనేయులు, ఉచ్చీరప్ప, నాగరాజు పాల్గొన్నారు.

మెరుగైన సదుపాయాలు కల్పించాలి

- ఎంపిడిఓ పుల్లయ్య

ప్రజాశక్తి - నందవరం

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ

అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఎంపిడిఓ పుల్లయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని జగ్గాపురం గ్రామాన్ని ఎంపిడిఓ పుల్లయ్య సందర్శించారు. ముందుగా సచివాలయాన్ని సందర్శించారు. సర్వేలు, పథకాల పురోగతి గురించి సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఉపాధి హామీ చట్టం కింద రూ.10 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు, డ్రెయినేజీ పనులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ పెద్దలు, సచివాలయ కార్యదర్శితో చర్చించారు. ముఖ్యంగా గ్రామంలో వేసవిలో తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలి : టిడిపి

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించాలని నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కౌతాళం మండలం హాల్వి గ్రామంలో శ్రీసిద్దేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను మహాంతేశ్వర స్వామి, టిడిపి సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు నైపుణ్యాన్ని ప్రదర్శించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి సురేష్ నాయుడు రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు హాల్వి కూటమి నాయకులు అందజేస్తారని ప్రకటించారు. ప్రతి క్రీడాకారుడు క్రమశిక్షణతో నడుచుకోవాలని తెలిపారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, అందరూ కలిసి మెలసి సంతోషంగా ఆడాలని సూచించారు. అనంతరం జట్టు క్రీడాకారుల పరిచయ కార్యక్రమం నిర్వహించి, కుంటనహాల్, కుంభళనూరు మ్యాచ్‌ను ప్రారంభించారు. సీనియర్ నాయకులు చిన్న సిద్దయ్య, కురువ నాగేష్, హనుమంతు, ఈడిగ హనుమంతు, సోము, మైబు, వీరేష్, ఉక్కి ఉన్న, గోవింద, బసవరాజు పాల్గొన్నారు.

రికార్డులను ఉంచుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

వాహనాలు నడిపే వారు వాహనాలకు సంబంధించిన రికార్డులను దగ్గర ఉంచుకోవాలని ఎస్ఐ పరమేష్ నాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక నాగలాపురం రహదారిలో ఉన్న సుంకప్ప తాత దర్గా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు తప్పకుండా డ్రెస్ కోడ్ పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించే వారిపై, నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. రికార్డులు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించారు. పోలీసు జమీర్ ఉన్నారు.

అధిక వర్షాలతో రైతు కుదేలు

- మసక బారిన పప్పు శనగ - నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలో అధిక వర్షాలతో రైతులు కుదేలయ్యారు. శనగ, జొన్న పంటలు మసకబారి నల్లగా మారాయి. సరైన దిగుబడులు వచ్చే పరిస్థితి కనబడడం లేదు. రైతులు నష్టాలను మూటగట్టుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రైతులకు నష్టపరిహారం అందజేయాలని రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మండలంలో అధిక వర్షాలతో పంటలు నాశనమై రైతులు కుదేలవుతున్నారు. డిసెంబర్ నెలలో కురిసిన తుపాను వల్ల అధిక వర్షాలతో రబీలో పండించిన పంటలు నాశనమవుతున్నాయి. బూజు రోగంతో పప్పు శనగ, జొన్న మసకబారి నల్లగా మారాయి. దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నల్లగా మారిన శనగ పంట

గతేడాది రబీలో సకాలంలో వర్షాలు రాకపోవడంతో పంటలు నాశనమయ్యాయి. ఈఏడాది అధిక వర్షాలతో నాశనమవుతున్నాయి. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం ఏమిటని రైతుసంఘాలు పేర్కొంటున్నాయి. ఆలూరు మండలంలో 16,900 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. పొలాలను దుక్కి దున్ని పప్పు శనగ పంటలను విత్తి విత్తినప్పటి నుంచి పురుగు మందుల వరకు పెట్టుబడి పెరిగింది. పురుగు మందులను అధిక ధరలతో కొని పిచికారి చేసి కలుపులు తీసి కాపాడుకుంటూ వచ్చారు. కాపు దశలో అధిక వర్షాలతో పంట పూర్తిగా నల్లగా మారి ఎండిపోయింది. పంటను చూసి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఇక పంటలపై ఆశలు వదులుకుని వలసబాట పడుతున్నట్లు తెలిసింది.

పెట్టుబడి నేలపాలు

- కురువ రంగస్వామి, రైతు, ఆలూరు

12 ఎకరాల్లో రూ.2 లక్షల పెట్టుబడి పెట్టి పప్పు శనగ పంట సాగు చేశాను. తుపాను వచ్చిన వర్షాలతో పంటంతా మసక బారి కాపు లేక పెట్టిన పెట్టుబడి నేల పాలయింది.

వాతావరణం కరుణించడం లేదు

- గోవిందురాజులు, రైతు, మనేకుర్తి గ్రామం

గతేడాది వర్షాలు లేక ఈఏడాది అధిక వర్షాలతో నష్టపోతూనే ఉన్నాం. రైతులకు వాతావరణం కరుణించడం లేదు. ప్రభుత్వాలు కనికరించడం లేదు. 10 ఎకరాల్లో పప్పు శనగ పంట సాగు చేశాను. బూజు రోగంతో పంట దిగుబడి రాక అంత నాశనమయింది.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

- యు.ఈరన్న, రైతుసంఘం మండల కార్యదర్శి

పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి. గతేడాది రబీలో వర్షాలు రాక నష్టపోతే రైతులను ఆదుకోలేదు. ఈఏడాది తుపాను ప్రభావంతో వచ్చిన వర్షాలకు నష్టపోయిన రైతులను ఈసారైనా ఆదుకుని పప్పు శనగకు కట్టిన ఇన్సూరెన్స్ క్లెయిమ్ వర్తింపజేయాలి.

'కూటమి'తోనే రైతులకు లబ్ధి

- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్

ప్రజాశక్తి - హాలహర్వి

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంతోనే రైతులకు లబ్ధి చేకూరుతుందని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్ తెలిపారు. పశువుల రక్షణకు ఉపాధి హామీ చట్టం నిధులతో మండలంలో 41 గోకులం షెడ్లు మంజూరు చేయగా, 10 పూర్తయ్యాయి. శుక్రవారం మండలంలోని మాచనూరు గ్రామంలో పూర్తయిన షెడ్లను వీరభద్ర గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు రక్షణగా షెడ్లు నిర్మించుకునేందుకు రైతులకు రాయితీపై ప్రభుత్వం రుణాలు మంజూరు చేసిందని తెలిపారు. మిగతా షెడ్లను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపిడిఒ వరలక్ష్మి, ఎపిఒ చక్రవర్తి, టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, అశోక్ యాదవ్, హాలహర్వి సర్పంచి మల్లికార్జున, వాటర్ షెడ్ ఛైర్మన్ కుబేర, ఎస్ఎంసి ఛైర్మన్ జయదేవ్, కృష్ణమ నాయుడు పాల్గొన్నారు.

దేవనకొండ మండలంలోని గుండ్లకొండ గ్రామంలో టిడిపి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి రామదాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధి ఏపీడీ పక్కీరప్ప మినీ గోకులం షెడ్డును ప్రారంభించారు. ఎపిఒ కృష్ణమూర్తి, పశు వైద్యాధికారి వెంకటేష్ పాల్గొన్నారు.

హాలహర్విలో షెడ్లను ప్రారంభిస్తున్న వీరభద్ర గౌడ్, అధికారులు

దేవనకొండలో షెడ్డును ప్రారంభిస్తున్న ఏపీడీ పక్కీరప్ప

పనికి తగిన వేతనమివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆదోని

చాలా ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు నెలకు రూ.28 వేల వేతనమివ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపాలిటీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ పద్ధతుల్లో ఇంజినీరింగ్ వాటర్ సెక్షన్లలో పని చేస్తున్నారని తెలిపారు. వారికి హెల్త్ కార్డు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ చేయాలని, విధుల్లో ఉంటూ చనిపోతే కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. మున్సిపాలిటీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పీరా, సోమన్న, అహ్మద్, ఉద్యోగులు కర్రెప్ప, ముని, శివ, శివకుమార్, బాష, కృష్ణమూర్తి, భరత్, రామాంజనేయులు ఉన్నారు.

అభివృద్ధిపై ప్రణాళిక లేని ఎమ్మెల్యే

- దమ్ముంటే అవినీతిని నిరూపించాలి

- మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒకటైనా నెరవేర్చారా, ఆదోని అభివృద్ధిపై ఎమ్మెల్యే పార్థసారథికి ఎలాంటి ప్రణాళికా లేదని మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తున్న తమపై వ్యక్తిగత దూషణలకు దిగుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ధోరణి మానుకోవాలని హితవు పలికారు. మాటల గారడీ తప్ప చేతల్లో ఎమ్మెల్యే చూపిందేమీ లేదని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. చిట్టా విప్పుతామంటూ పదే పదే కూటమి నాయకులు భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, వారి తాటాకు చప్పుళ్లకు బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తమ హయాంలో అభివృద్ధి తప్ప ఎలాంటి అవినీతి, అక్రమాలకూ పాల్పడలేదని తెలిపారు. ప్రభుత్వంలో ఉండి కూడా చిట్టా విప్పుతామంటూ చెప్పడం చూస్తుంటే నవ్వొస్తోందని చెప్పారు. ఆధారాలుంటే ప్రజలకు వివరించాలే తప్ప ప్రెస్ మీట్లకే పరిమితం కావడం ఏమిటని నిలదీశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

వేసవిలో నియోజకవర్గ ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కోకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని డిమాండ్ చేశారు. అదనపు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కోసం రూ.30 కోట్లు మంజూరు చేయించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయించాలని, డిగ్రీ కళాశాలకు సొంత భవనం మంజూరు చేయించాలని సవాల్ విసిరారు. రూ.240 కోట్లతో నిర్మితమవుతున్న హైవే పనులు త్వరగా పూర్తి చేయించేందుకు దృష్టి పెట్టకుండా లేనిపోని మాటలతో కాలయాపన చేయడం మానుకోవాలని తెలిపారు. ఆధార్ మార్కింగ్‌తో విలువైన ప్లాటు అక్రమ రిజిస్ట్రేషన్, బతికున్న మనిషినే చనిపోయాడని రూ.కోట్లు విలువ చేసే ఆస్తి కొట్టేయడం వంటి వాటికి తాము పాల్పడలేదని చెప్పారు. దమ్ము, ధైర్యం ఉంటే అక్రమాలకు పాల్పడిన డాక్టర్ రవి కిరణ్, ఇటీవల వెలుగులోకి వచ్చిన రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని హితవు పలికారు. నాయకులు చంద్రకాంత్ రెడ్డి, దేవదాసు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, నాగరాజు, శ్రీలక్ష్మి, ఫయాజ్, మాధవరెడ్డి, పరిగెల నారాయణ, ఈరన్న ఉన్నారు.

ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలకు ముప్పు

- తహశీల్దార్ రవి

ప్రజాశక్తి - మంత్రాలయం

తుంగభద్ర నది నుంచి ఇసుకను తరలిస్తే నదిలో భూగర్భ జలాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తహశీల్దార్ ఎస్.రవి తెలిపారు. శుక్రవారం తుంగభద్ర నది పరివాహక ప్రాంతంలో పర్యటించి ఇసుకాసురులకు వార్నింగ్ ఇచ్చారు. స్థానిక తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుకను తోడేయడం వల్ల నదిలో భూగర్భ జలాలు అడుగంటి పోతాయని, భవిష్యత్తులో నీటి పారుదలను అంచనా వేయడం కష్టం అవుతుందని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాల్సిన అవసరం ఉందని సెంట్రల్ వాటర్ కమిషన్ వారు తమకు రిపోర్ట్ చేసినట్లు చెప్పారు. ఈ అంశంపై త్వరలో పోలీసు శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి చర్చిస్తామని తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం

- ఎంపిడిఒ అల్లా బకాష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామాల్లో ఇప్పటికీ అక్కడక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని పూర్తిగా నివారించడానికి కృషి చేయాలని ఎంపిడిఒ అల్లా బకాష్, ఎంఇఒ సావిత్రమ్మ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తెలిపారు. శుక్రవారం మండల కార్యాలయంలో సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో కిశోరి బాలిక వికాసంపై అంగన్వాడీ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కౌమార దశలో బాలికల్లో వచ్చే మార్పులు, ఆరోగ్య జాగ్రత్తలు, బాలికల విద్యాభివృద్ధి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెళ్లి వయస్సుతో సంబంధం లేకుండా బాలికల తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తున్నారని, అలా జరగకుండా తల్లిదండ్రులకు, బాలికలకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ప్రభుత్వ డాక్టర్ పార్వతమ్మ, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, ఎపిఎం నాగార్జున, హౌసింగ్ ఎఇ భవ్య, అస్పిరేషనల్ అధికారి నరసింహులు పాల్గొన్నారు.

సరిహద్దులో మహిళ మృతదేహం

ప్రజాశక్తి - కౌతాళం

ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో శుక్రవారం మహిళ మృతదేహం లభ్యమైంది. మండలంలోని బాపురం గ్రామ సమీపంలో (కర్ణాటక ప్రాంతం) గుర్తు తెలియని మహిళను గొంతు కోసి, చెవులు కోతకు గురయ్యాయి. జొన్న పొలంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం చూసిన ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పరుగులు తీశారు. బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలూకా ఆచోలి పోలీసు స్టేషన్ పరిధిలోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. సరిహద్దు ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పొలాలకు వెళ్లాలంటే భయంభ్రాంతులకు గురవుతున్నారు.

గౌడు బసమ్మగా గుర్తించిన కర్ణాటక పోలీసులు

కౌతాళం స్టేషన్ పరిధిలోని సులేకేరి గ్రామానికి చెందిన గౌడు బసమ్మగా కర్ణాటక పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న కర్ణాటక పోలీసులు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతురాలు బసమ్మ అగసలదిన్నెకు చెందిన ఒక వ్యక్తికి అప్పు ఇచ్చినట్లు తెలిసింది. అప్పు తీసుకున్న వ్యక్తి డబ్బులు చెల్లిస్తామని పిలిపించి ఈ ఘాతుకానికి వడిగట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు దర్యాప్తు చేపడితే ఈ హత్యకు సంబంధించిన విషయాలు బయటికి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

గర్భిణీపై దాడి

- హులేబీడులో ఘటన

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని హులేబీడులో గర్భిణీపై దాడి జరిగిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గర్భిణీ శ్రీదేవి వివరాల మేరకు... గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇంటి ముందు నీరు రావడంతో డ్రెయినేజీ నీరు ఎందుకు చల్లుతున్నారని శ్రీదేవి, అత్త నారాయణమ్మ అడిగేందుకు వెళ్లారు. వారిపై రామలింగ, సంజప్ప, రంగస్వామి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోని ఆస్పత్రికి రెఫర్ చేశారు. దాడి చేసిన వారిపై శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లైనింగ్ పనులు చేపట్టాలి : సిపిఎం

హంద్రీనీవా కాలువ విస్తరణ తర్వాతే

ప్రజాశక్తి- దేవనకొండ

హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాలువకు ప్రభుత్వం లైనింగ్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం సరైంది కాదని, హంద్రీనీవా విస్తరణ పనులు పూర్తయిన తర్వాతే ఇతర కార్యక్రమాలు చేపట్టాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హంద్రీనీవా నుంచి కుప్పం వరకు నీళ్లు తీసుకోవాలనే నిర్ణయం మంచిదేనని, హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పూర్తి చేయడం, హంద్రీనీవా సామర్థ్యాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. నీటి వినియోగం మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాలన్నప్పుడు హంద్రీనీవా సామర్థ్యాన్ని కూడా పెంచాలని, అప్పుడే అందరికీ సాగు, తాగునీరు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 40 టిఎంసిల సామర్థ్యాన్ని 100 టిఎంసిలకు పెంచాలని డిమాండ్ చేశారు. 2018లో హంద్రీనీవా విస్తరణ పనులకు కూడా చంద్రబాబు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, పనులు కూడా మొదలయ్యాయని తెలిపారు. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం రావడంతో నాటి జగన్ ప్రభుత్వం దాన్ని అమలు చేయలేదని చెప్పారు. చంద్రబాబు నాయుడు తిరిగి అధికారంలోకి రావడం, సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో ఈ ప్రాంత ప్రజలు హంద్రీనీవా వెడల్పు కార్యక్రమం వస్తుందని ఆశించారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల హంద్రీనీవా నుంచి సాగునీరు వచ్చే ప్రాంతాలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని చెప్పారు. లైనింగ్ వల్ల భూగర్భ జలాలపై ప్రభావం పడుతుందని, ప్రభుత్వం ప్రజలు, రైతుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు అశోక్, యూసుఫ్ బాష, సిఐటియు సీనియర్ నాయకులు నాగేష్, నాగేంద్ర, రంగన్న, రామాంజనేయులు, హనుమంతు, రైతులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

'కడప' అధ్యక్షులుగా తిమ్మారెడ్డి

- తిమ్మారెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

తిమ్మారెడ్డిని సన్మానం చేస్తున్న లియాఫీ నాయకులు

కడప డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా పాటిల్ తిమ్మారెడ్డి ఎంపికయ్యారు. శుక్రవారం కడప డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికలో గెలిచిన పాటిల్ తిమ్మారెడ్డిని ఎమ్మిగనూరు బ్రాంచిలో ఎల్ఐసి ఏజెంట్లు, ఉద్యోగులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు ఘనంగా సన్మానించారు. బ్రాంచి మేనేజర్ పులి నాయక్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు విజయ కుమార్, రఘునాథ్ గౌడ్, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, రాము, మురళీ, బ్రహ్మారెడ్డి, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు రాజేష్, మధు, మోయినుద్దీన్, వీరాంజనేయులు, లియాఫీ జోనల్ డివిజనల్ బ్రాంచి నాయకులు ప్రభాకర్ రెడ్డి, జయన్న, వీరేష్, వెంకటేశ్వర్ రెడ్డి, రమేష్, హరి, అనంత భూరళి, జెకె.శివ రాముడు, గఫూర్, ప్రభాకర్, ఎల్ఐసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఇందిరా, మహేష్ కుమార్, ప్రతాప్ మాట్లాడుతూ... ఎమ్మిగనూరు బ్రాంచి నుంచి డెవలప్‌మెంట్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షులుగా తిమ్మారెడ్డి ఎంపిక కావడం హర్షణీయమని తెలిపారు. ఆయన బ్రాంచిలో వ్యాపారం తీసుకు రావడంలో, డివిజన్‌లో టాప్ త్రీలో ఉన్నారని చెప్పారు. తిమ్మారెడ్డి మాట్లాడుతూ... తాను ఈ స్థాయికి ఎదగడానికి తన టీంలో ఉండే ఏజెంట్లు, బ్రాంచిలో ఉండే ప్రతి ఉద్యోగి సహాయం అందించారని తెలిపారు. ఉద్యోగులు వీరారెడ్డి, సురేష్, వెంకటేష్, శ్రీవాణి, ఏజెంట్లు రంగస్వామి, దేవేంద్ర మూర్తి, అక్బర్, విష్ణు పాల్గొన్నారు.

రీసర్వేలను సద్వినియోగం చేసుకోవాలి

- తహశీల్దార్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - నందవరం

రీసర్వేలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నది కైరవాడి గ్రామంలో శుక్రవారం ఆయన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 20 నుంచి రీ సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా నది కైరవాడి గ్రామాన్ని రీసర్వేకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హడావిడిగా కాకుండా రోజూ 20 ఎకరాల భూమిని సర్వే చేస్తామని చెప్పారు. సర్వే చేసే సమయంలో భూ యజమానులు భూములకు సంబంధించిన రికార్డులు దగ్గర ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామస్తులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2009లో సంభవించిన వరదల్లో సుమారు 400 కుటుంబాలు నివాసాలను కోల్పోయాయని తెలిపారు. అప్పటి ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు నివాసాలను ఏర్పాటు చేసేందుకు 15 ఎకరాల భూమిని కేటయించి పట్టాలు మంజూరు చేసినట్లు చెప్పారు. లబ్ధిదారులకు పొజిషన్ చూపించకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని వాపోయారు. అధికారులు స్పందించి స్థలాలను చూపించాలని కోరారు. డిప్యూటీ తహశీల్దార్ మహేష్, టిడిపి నాయకులు కైరవాడి వీరేష్, వీరారెడ్డి పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహన ర్యాలీ, గ్రామసభ

- పైలట్ గ్రామంగా గోనెగండ్ల

ప్రజాశక్తి - గోనెగండ్ల

గత వైసిపి ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రీ సర్వే కార్యక్రమాన్ని ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు పేరుతో తిరిగి చేపట్టనుంది. ఈ సర్వేపై గోనెగండ్లలోని గంజిహళ్లి రోడ్డు నుంచి పంచాయతీ కార్యాలయం వరకు తహశీల్దార్ కుమారస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం మేజర్ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కుమారస్వామి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి భూముల సర్వేను తిరిగి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీతో పాటు గ్రామసభ నిర్వహించామన్నారు. జిల్లా అధికారులు రీ సర్వే పైలట్ గ్రామంగా గోనెగండ్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. గత రీ సర్వేలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఈసారి పకడ్బందీగా రీ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా రోజూ సర్వే ఏయే సర్వే నెంబర్లలో ఎక్కడెక్కడ జరుగుతుందో ఆయా సర్వే నెంబర్లలోని రైతులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తారన్నారు. గోనెగండ్ల సర్పంచి హైమావతి, టిబిపి ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ అచ్చుగట్ల హుస్సేన్, టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, ఎన్‌వి.రామాంజనేయులు, శ్రీధర్ నాయుడు, రంగముని, రమేష్ నాయుడు, గౌవుండా రహమతుల్లా, డీలర్ ఫక్రుద్దీన్, కోటేకల్ రఫీ, రీసర్వే డిటి శిరీష, ఆర్ఐ జనార్ధన రావు పాల్గొన్నారు.

నందవరంలో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసులు

గోనెగండ్లలో మాట్లాడుతున్న తహశీల్దార్

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

మంత్రాలయంలో మాట్లాడుతున్న పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వైకుంఠ ద్వారం ద్వారా శ్రీనివాసుని దర్శించుకున్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక పాత ఊరులో శ్రీదేవి, భూదేవి సమేతుడై వెలసిన వెంకటేశ్వర స్వామికి మంగళ హారతులు ఇచ్చారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీమఠం ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి వైకుంఠ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో ముస్తాబయిన వైకుంఠ ద్వారాన్ని పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ప్రారంభించి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యతను, విశిష్టతను వివరించారు.

ఆలయాల్లో భక్తుల సందడి

ఆస్పరి : వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆస్పరిలోని శ్రీజనార్ధన స్వామి దేవాలయంలో, హాలిగేర గ్రామ సమీపంలో వెలసిన శ్రీకుర్మానారాయణ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. నలగుట్టయ్య, కుర్మానారాయణ స్వామిని ఎంపిపి ఉమాదేవి, వైసిపి మండల మాజీ కన్వీనర్ రామాంజినేయులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ నిర్వాహకులు నరేంద్ర ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను పల్లకిలో అధిష్టించి స్థానిక పుట్ట దగ్గరకు ఊరేగించి, తిరిగి యథాస్థానానికి చేర్చారు. **దేవనకొండ** శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా సాగాయి. పండితులు లక్ష్మీనారాయణ స్వామి ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి విశిష్టతను వివరించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆస్పరిలో...

మా పొలం మాకు ఇప్పించండి సారు..!

- న్యాయం చేస్తానని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హామీ

ప్రజాశక్తి - హొళగుంద

వినతిపత్రం అందజేస్తున్న బాధితురాలు

తమ పొలం తమకు ఇప్పించాలని రైతు సబ్ కలెక్టర్‌ను కోరారు. హొళగుంద గ్రామానికి చెందిన మారెమ్మ అనే మహిళా రైతుకు చెందిన సర్వే నెంబర్ 365 సి1సిలో 1.52 సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు మరో వ్యక్తి పేరుపై మార్చడంతో బాధితురాలు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. శుక్రవారం సాయంత్రం విచారణ చేపట్టారు. మహిళా రైతు సబ్ కలెక్టర్‌తో మాట్లాడారు. తమకు తెలియకుండా తమ పేరుపై తహశీల్దార్‌కు అర్జీ ఇచ్చి 40 ఏళ్లుగా సాగులో ఉన్న తమ పొలాన్ని కొందరు అక్రమంగా లాక్కోవాలని చూస్తున్నారని తెలిపారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. ఆయన స్పందిస్తూ... విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత పొలాన్ని సందర్శించి తహశీల్దార్ సతీష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ విషయంపై తహశీల్దార్ సతీష్‌ను వివరణ కోరగా... రైతుల నుంచి రికార్డుల ప్రకారం మ్యూటేషన్ చేశామని, బాధితుల నుంచి వివరణ తీసుకుని న్యాయం చేస్తామని తెలిపారు.